క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10–30 గంటలకు ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య, తాగు నీరు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ పథకం మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ. సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

ఘనంగా గజ్జె పూజ మహోత్సవం



పూజా కార్యక్రమంలో చిన్నారులు, గ్రామస్తులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం ఎర్రబల్లె పంచాయతీ చంద్రగిరి గ్రామంలో సోమవారం సీతాలమ్మతల్లి గజ్జె పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువులు సిద్దయ్య, కిశోర్, మస్తాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కోలాటం, గజ్జె పూజ వేడుకలను డెకరేషన్ లైటింగ్‌లతో నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఈకేవైసీ తప్పనిసరి

చింతకొమ్మదిన్నె : అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈకేవైసీ చేయించుకోని రైతులు 102 మంది ఉన్నారని, వారి జాబితాను సంబంధిత రైతు సేవా కేంద్రం నోటీస్ బోర్డ్‌లో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రైతులు తమ రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ కాని వారు ఈకేవైసీ రెండు రోజులలో పూర్తి చేయించుకోవాలని, లేకుంటే వారికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని తెలిపారు.


దీర్ఘకాలిక వ్యాధులపై సర్వే



సర్వేను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

జమ్మలమడుగు: దీర్ఘకాలిక రోగాలపై ఎస్‌సీడీసీడీ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్‌లపై సర్వే నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని దేవగుడి, సుగుమంచిపల్లె గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం కడప వైద్యశాల అసోషియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ సీవీ సుబ్బారాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో దీర్ఘ కాలిక వ్యాధులతో బాధ పడుతున్నవారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేంద్రరెడ్డి, మోరగుడి డాక్టర్ తస్మియా, సూపర్‌వైజర్లు, ఏఎస్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో త్యాగరాజస్వామి

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో వెలసిన త్యాగరాజు స్వామి గ్రామోత్సవం నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. త్యాగరాజు స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట 41 రోజు పూర్తయిన సందర్భంగా త్యాగరాజ స్వామికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గ్రామపురి వీధుల గుండా మంగళ వాయిద్యాలతో టపాసులు పేల్చుకుంటూ ఊరేగింపు చేశారు. నాయీ బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని ఊరేగింపును విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవ సంఘం అధ్యక్షులు వెంకట రత్నం, గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, కోశాధికారి రామాంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చక్రాయపేట: చక్రాయపేట ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు.10 తరగతి ఉత్తీర్ణులైన 40 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జులై 15 లోపు ఆన్‌లైన్‌లో లేదా 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకువస్తే తమ కళాశాలలోనే దరఖాస్తు చేయిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జులై 17వ తేదీన ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9491056605, 0040621608 నంబర్లలో సంప్రదించాలని ఆయన చెప్పారు.

రోడ్లపైనే వ్యాపారం.. ఆగదా ఈ వ్యవహారం!

- కుంచించుకుపోతున్న రోడ్లు
- రద్దీ సమయంలో ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని పోలీసులు, అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు



వేంపల్లె ప్రధాన రహదారిపై కూరగాయలను విక్రయిస్తున్న వ్యాపారులు

వేంపల్లె : పట్టణంలోని ప్రధాన రహదారిలో జ్యూస్ విక్రయ కేంద్రాలు, కూరగాయలతో పాటు కొందరు చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్నారు. గత ప్రభుత్వంలో ట్రాఫిక్ ఇబ్బందులు చూసి 72 అడుగుల మేర రోడ్డు వెడల్పు చేయాలని భావించి.. నిర్మాణ పనులు కూడా చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో రోడ్డు వెడల్పు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో కొందరు రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. డ్రైనేజ్ కాలువలు పూర్తయినప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రధాన రహదారిలో వ్యాపారాలు చేస్తున్న కొందరికి కల్పతరువుగా మారింది. దేవస్థానానికి చెందిన వాణిజ్య గదుల్లో వ్యాపారం చేసున్న దుకాణదారులు తమ దుకాణాల ఎదుట ఉన్న స్థలాన్ని చిరువ్యాపారులకు అద్దెకు చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. దీంతో వారు రోడ్డుపైనే టెంట్లు వేసి కూరగాయలు, జ్యూస్ సెంటర్లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న దుకాణాలను తొలగించడంలో పోలీసులు అలసత్వం ప్రదర్శిస్తుడటంతో వారు ఇష్టం వచ్చినట్లు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులకు స్థానికులు సమాచారమివ్వడంతో రెండు రోజుల క్రితం రోడ్లపై పెట్టిన దుకాణాలు తొలగించాలని ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ ఆదేశించారు. అయినప్పటికీ రోడ్లపై యథేచ్చగా వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు. దుకాణాదారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలమవుతోందని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

రాయచోటి – పులివెందుల – కడప రోడ్లపై వాహనాలు రద్దీగా ఎక్కువగా ఉంటోంది. అలాగే ద్విచక్ర వాహనాలు కూడా దుకాణాల ఎదుట ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. పోలీసులు చర్యలు తీసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు అంటున్నారు. మరోవైపు తోపుడు బండ్లపై ఆటోల్లో పండ్లు వ్యాపారం చేసుకుంటున్నా వారు కూడ అక్కడక్కడా బండ్లు, ఆటోలు పెట్టుకుని వ్యాపారం చేస్తుండటంతో ట్రాఫిక్ మరింత జఠిలమవుతోందని, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అస్థవ్యస్తంగా ట్రాఫిక్



వేంపల్లి పట్టణంలో ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ అస్థవ్యస్తంగా తయారైంది. దుకాణదారులు తమ దుకణాల ఎదుట ఉన్న స్థలంతో చిరు వ్యాపారాలు బాడుగకు ఇస్తున్నారు. అంతేకాదు ద్విచక్ర వాహనాలు అడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం వచ్చిన పోలీసులు చూసీ చూడనట్టుగా వ్యవరిస్తున్నారు. దీంతో మరింత ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

– ఉమర్, వేంపల్లె

పోలీసులు చొరవ తీసుకోవాలి



ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు, ఆటోలు, అంగళ్లకు సరుకులు చేరవేసే భారీ వాహనాలు అడ్డుపెట్టడంతో అధికంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లు పక్కల ఉన్న మట్టిని తొలగించి వాహనాలు వెళ్లే విధంగా చూడాలి. పోలీసులు చొరవ తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించాలి

– శంకరయ్య, వేంపల్లె

నేటి నుంచి ఆధార్ సేవలు

ముద్దనూరు: మండలంలోని ముద్దనూరు–2,కొర్రపాడు సచివాలయాల్లో మంగళవారం నుంచి నిరంతర ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆధార్ కేంద్రాల్లో 0–5 సంవత్సరాల వారికి ఆధార్‌కార్డు అప్‌డేట్, చిరునామా, ఫొటో మార్పు, సెల్‌ఫోన్ నంబరు లింక్, వేలిముద్రలు అప్‌డేట్ చేసే సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధార్‌సేవా కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

26న గండిలో షీల్డ్ టెండర్ల వేలం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఏడాది కాలం పాటు పూలు విక్రయించుకొను హక్కు, షాపింగ్ కాంప్లెక్స్ గదులు, టోల్ గేట్ వసూలుకు గురువారం షీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టెండర్లలో పాల్గొనే వారు పూలు విక్రయించు కొను హక్కుకు రు.5లక్షలు, టోల్ గేటు వసూలు చేసుకొను హక్కుకు రు.5లక్షలు, షాపింగ్ గదులుకు రు.30 వేల చొప్పున ధరావత్తును చెల్లించాలని చెప్పారు. టెండర్లు ఉదయం 10 గంటలకు ప్రారంభ మవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరములకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన



అధికారులను ప్రశ్నిస్తున్న ఉపాధి కూలీలు

జమ్మలమడుగు: ఉపాధి పనులు చేసి మూడు వారాలు కావస్తున్నా నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఉపాధిహామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కదిరేవారి పల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు తమ కూలీ డబ్బులు ఇప్పించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరమణయ్యకు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తమ గ్రామంలో మొత్తం 8 గ్రూపులు ఉండగా ఒక్కొక్క గ్రూపులో 20 మంది కూలీలతో ఉపాధి పనులు చేస్తున్నామని. మూడు వారాలుగా తాము ఉపాధి పనిచేశామని ఒక్క రోజు కూలీ మాత్రమే వేసి మిగిలిన కూలీ డబ్బులు వేయాలంటే లంచం ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్ డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. మిగిలిన ఐదు గ్రూపులకు కూలీ డబ్బులను వారి ఖాతాలలో జమ చేశారని, తమకేందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. అంతేకాకుండా చేసిన పనులకు కొలతలు వేయకుండా ఆ పనులకు డబ్బులురావంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఏప్రిల్ మూడో తేది నుంచి కూలీ డబ్బులు జమకాలేదని, అధికారులు స్పందించి తమ డబ్బులు ఇప్పించాలని, టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ వెంకట రమణయ్య మాట్లాడుతూ విచారించి కూలీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

పులివెందుల రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీడీఓ కృష్ణమూర్తి అన్నారు. పులివెందుల ఎంపీడీఓ పనిచేస్తున్న శ్రీనివాసులరెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సింహాద్రిపురం మండలంలోని ఎంపీడీఓగా పనిచేస్తున్న కృష్ణమూర్తి పులివెందులకు బదిలీ అయ్యారు. పులివెందుల ఎంపీడీఓగా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మండల అభివృద్ధికి కృషి

సింహాద్రిపురం : మండల అభివృద్ధి దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కృష్ణమూర్తి పులివెందుల ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. అనంతరం ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొంటున్న సమస్యలపై దృష్టి సారించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఎక్స్‌రే యూనిట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



కమలాపురం సామాజిక ఆరోగ్యం కేంద్రం

కమలాపురం: కమలాపురం పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే యూనిట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు, రోగులు కోరుతున్నారు. గతంలో ఎక్స్‌రే ప్లాంటు ఉండేదని, అయితే టెక్నీషియన్ లేక పోవడంతో అది క్రమంగా మూలకు చేరింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి దాదాపు రూ.8కోట్లు వెచ్చించి అత్యాధునికంగా ఆసుపత్రి నిర్మాణం చేపట్టారు. ఎన్నికలకు ముందు ఆసుపత్రి ప్రారంభోత్సవం కూడా జరిగింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్పందించి ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు రామిరెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకట సుబ్బయ్య కోరుతున్నారు. అలాగే ఈసీజీ కూడా ప్రింట్ రావడం లేదని దానిపై కూడా శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

'యువత పోరు'కు తరలిన నాయకులు

వల్లూరు (చెన్నూరు) : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కడప కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి చెన్నూరు మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశామని తెలిపారు. కమలాపురం విద్యార్థి విభాగ అధ్యక్షుడు సాయికుమార్ రెడ్డి. యువజన విభాగ అధ్యక్షులు నిత్య పూజయ్య, ఉపాధ్యక్షులు రామకోటి రెడ్డి, సెక్రటరీ సాయినాథ్ రెడ్డి, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు దేవగుడి భాస్కర్ రెడ్డి, కృష్ణ, సాయి కుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పార్థసారథి, బ్రహ్మయ్య, శివరాం, ఖాజాపీర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు కృషి



డిప్యూటీ డీఎంహెచ్‌ఓకు ఆహ్వానం పలుకుతున్న వైద్యులు

జమ్మలమడుగు: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత తెలిపారు. నూతన డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా సోమవారం డాక్టర్ గీత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు వసతుల కల్పనతో పాటు వైద్యులు సమయ పాలన పాటించి వైద్యం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించడం, దోమతెరల వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తాహీరా, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

చక్రాయపేట: ప్రతి మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని కర్మయోగం విశిష్టత గురించి తెలియజేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని హిందూ ధర్మ ప్రచార ప్రబోధ సేవా సమితి పులివెందుల కమిటీ వరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సురభి గ్రామం, బాలతిమ్మయ్యగారిపల్లెలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహేశ్వరరెడ్డి,రామాంజి, పోతులూరు, వెంకటయ్య, కృష్ణవేణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ



శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ నేటి తరానికి చెందిన రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసా మాట్లాడుతూ అఖండ భారతదేశం కోసం బలిదానమైన వ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు లక్ష్మిరెడ్డి, సుష్మా, ఈశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మునగల చంద్ర, చరణ్, ప్రసాద్, సంతోష్, సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలి



ఆర్డీఓ చిన్నయ్యకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పులివెందుల టౌన్ : సచివాలయ ఉద్యోగులందరికీ న్యాయం జరిగే విధంగా బదిలీలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం సచివాలయ ఉద్యోగులు బదిలీల్లో భాగంగా ప్రభుత్వం జీవో నంబర్ 5 ప్రకారం లోక్ మండలాల్లో ఉద్యోగం చేయకూడదనే నిబంధన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి మనో వేదనకు గురి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఈ విషయమై ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిభంధనలలో సొంత రెవెన్యూ మండలంలో పని చేయకూడదనే నిబంధనను తొలగించి అందరికీ సొంత రెవెన్యూ మండలంలో, సొంత రెవెన్యూ మండలానికి సంబంధించిన మున్సిపాలిటీల్లోనే బదిలీ అవకాశం కల్పించాలన్నారు. మున్సిపాలిటీల విషయంలో మున్సిపాలిటీని యూనిట్‌గా తీసుకోకుండా సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న వారికి అదే మునిసిపాలిటి పరిధిలోని ఒక సచివాలయం నుండి మరొక సచివాలయానికి బదిలీలు చేపట్టాలన్నారు. గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని వారు కోరారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

తొండూరు : తొండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల ప్రవేశాలకు బుధవారం పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 6, 7, 8, 9వ తరగతుల ప్రవేశాల కోసం బుధవారం కడప నగరంలోని చిన్నచౌక్‌లోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థునులు తప్పనిసరిగా పరీక్షలకు హాజరుకావాలని కోరారు.

కమలాపురం: స్థానిక బాలయోగి గురకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. తులశమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోని విద్యార్థులు కూడా పరీక్షకు అర్హులేనని పేర్కొన్నారు. వీరికి పరీక్ష కేంద్రం వద్ద ఇన్‌స్టంట్ హాల్ టికెట్లు జారీ పరీక్షకు అనుమతిస్తామని ఆమె తెలిపారు. బాలికలకు చిన్న చౌక్ గురుకుల పాఠశాలలో, బాలురకు రామాపురం గురుకులంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. అలాగే 5వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష రాసి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారికి ఈ నెల 26న చిన్న చౌక్ గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామని ఆమె తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో మిగిలిన సీట్లను ప్రవేశ పరీక్ష రాసి వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారికి ఈ నెల 27న చిన్నచౌక్ గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో సీట్లు వచ్చి ఏదైనా గురుకులంలో జాయిన్ అయిన వారు కూడా ట్రాన్స్‌ఫర్ కావాలనుకునే వారు 27న చిన్న చౌక్ గురుకులంలో జరిగే కౌన్సెలింగ్‌కు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

సింహాద్రిపురం : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కోవరంగుంటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దోమకాటు వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యులు స్రవంతి, ప్రత్యూష హాజరై దోమకాటు వల్ల కలిగే వ్యాధులు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించడం, దోమతెరల వాడకంపై తెలియజేశారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి ఖాదర్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, పద్మావతమ్మ, రాధ, శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటి కోసం కోటి విద్యలు





ప్రస్తుత సమాజంలో టీవీలు, మొబైల్స్, సోషల్ మీడియా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతుండటంతో కళలు అంతరించిపోతున్నాయి. పొట్ట కూటి కోసం కోటి విద్యలు అన్నట్లు కళాకారులు వీధినపడ్డారు. గతంలో కళాకారులు వివిధ రకాల నాటకాలు వేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. అయితే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో వీధి నాటకాలకు ఆదరణ కరువైంది. నాటకాలు అంతరించిపోతుండటంతో పూట గడవాలన్నా కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో కళాకారులు వేషాలు వేసుకుని గ్రామాల్లోని వీధులలో తిరుగుతూ మహాభారతం, రామాయణం తదితర ఇతి హాసాలను వివరిస్తూ బిక్షాటన చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ప్రభుత్వం మాలాంటి వారిని గుర్తించి ప్రత్యేక పింఛన్లను మంజూరు చేయాలన్నారు.

– సింహాద్రిపురం

రైతులందరికీ సుఖీభవ సాయం అందించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని డీకేటీ, చుక్కల భూములు సాగు చేస్తున్న వారితోపాటు కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ సాయాన్ని అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, పోతిరెడ్డిభాస్కర్‌లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీకేటీ రైతుల్లో ప్రధానంగా పేద రైతులే ఉన్నారని, అన్నదాత సుఖీభవ పథకం నుంచి వీరిని తొలగించడం అన్యాయమన్నారు. 2014–19లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రైతులకు లక్షన్నర రూపాయలు రుణమాఫీ చేస్తామన్నారని పేర్కొన్నారు. కానీ, రూ. 50 వేలలోపు ఉన్న రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి అంతకు పైబడిన రుణాలకు బాండ్లు అందజేశారని తెలిపారు. అయితే బాండ్లకు సంబంధించిన డబ్బులు బ్యాంకుల్లో జమ చేయకపోవడం వల్ల లక్షలాది మంది రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడున్నది కూడా చంద్రబాబే గనుక రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.